

మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నేతలు

# మళ్లీ కేసీఆర్ సారే రావాలి

## బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారంలో ప్రజల స్పందన

మేడ్చల్, అక్టోబర్25(నమస్తే తెలంగాణ)/ఘట్‌కేసర్ : బీఆర్ఎస్ అభ్యర్థులు నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డి, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కేపీ వివేకానంద్ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందజేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి స్పందన వస్తున్నది.

### ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ అభ్యర్థులు

జిల్లాలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ అందజేసి తమకు మద్దతు తెలుపాలని కోరుతున్నారు. దీంతో ప్రజలే మూడోసారి కేసీఆర్ సార్ రావాలే అంటూ అభ్యర్థులకు మద్దతు ఇస్తూ కారు గుర్తుకే ఓటు వేస్తామంటున్నారు. దీంతో ఇంటింటి ప్రచారంలోబీఆర్ఎస్ అభ్యర్థులు మరింత దూసుకెళ్తున్నారు.

### కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల్లో నిరుత్సాహం

జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారం ప్రారంభం కాకపోవడంతో ఇరు పార్టీల శ్రేణులు నిరుత్సాహానికి గురవుతున్నారు. జిల్లాలో కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించినప్పటికీ వర్గ పోరుతో ప్రచారాన్ని ప్రారంభించలేక పోతున్నారు. బీజేపీ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మినహా మిగతా నాలుగు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేని పరిస్థితి ఏర్పడింది. నామినేషన్లకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకు అభ్యర్థుల ప్రకటన వెలవడకపోవడంతో బీజేపీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు.

### అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి చేరికలు

- మంత్రి చామకూర మల్లారెడ్డి

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సుమారు 60 మంది మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచుకున్నారు. వీరికి గులాబీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో లింగస్వామి, బంగారయ్య, మల్లేశ్, క్రిష్ణయాదవ్, బాలక్రిష్ణ, నరసింహ, సుబ్బారావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవ రెడ్డి, కౌన్సిలర్లు అనురాధ,రమాదేవి, నాయకులు తదిరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

# ఒక్కటే మాట.. గులాబీ బాట

బీఆర్ఎస్ అభ్యర్థులకు పెరుగుతున్న మద్దతు

- కారు గుర్తుకే ఓటు వేస్తామంటూ ఏకగ్రీవ తీర్మానాలు
- ప్రచారంలో అభ్యర్థులకు జనం నీరాజనం

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమరంలో బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి జనం నీరాజనం పలుకుతున్నారు. అడుగడుగునా డప్పుచప్పుళ్లు, బతుకమ్మ ఆటలు, పూల వర్షంతో ఆదరిస్తున్నారు. మహిళలు మంగళ హారతులు పట్టి, నుదుటన కుంకుమ తిలకం దిద్ది శాలువాలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుతున్నారు. అభ్యర్థులు సైతం పదేండ్లలో జరిగిన అభివృద్ధి కండ్ల ఎదుటే ఉన్నాయని, మరిన్ని అభివృద్ధి, సంక్షేమం జరిగేందుకు మరోసారి ఆశీర్వదించాలని కోరుతుండగా..కొన్ని చోట్ల కాలనీ సంఘాలు, అసోసియేషన్లు, బస్తీ వాసులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి కారు గుర్తుకే ఓటు వేస్తామంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, ఉప్పల్, సనత్‌నగర్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఎక్కువగా తీర్మానాల జాతర నడుస్తోంది. కళ్లముందు సంక్షేమం, అభివృద్ధి- ఇంటి ముందు అభ్యర్థి అంటూ స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల ఆధారంగానే ప్రచారం పర్వం సాగుతుండటంతో ఎమ్మెల్యేలకు మద్దతుగా కాలనీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు బ్రహ్మరథం పడుతున్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గం రాంగోపాల్ పేట్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

### బీఆర్ఎస్ అభ్యర్థులకు విశేష స్పందన

ఎన్నికల నోటిఫికేషన్ కంటే నెలన్నర ముందే అభ్యర్థులను ప్రకటించి బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతోంది. ఇన్నాళ్లూ ప్రజల్లో ఉండి సమస్యలను పరిష్కరించిన బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పుడు తాము చేసిన అభివృద్ధినే ప్రజల ముందు పెట్టి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అభివృద్ధి ఫలాలు ఎలా ఉన్నాయనే దానిపై వివిధ రూపాల్లో ప్రజల్లోకి తీసుకుపోతుండగా... అదేరీతిన ప్రజల్లోనూ విశేష స్పందన వస్తున్నది. తమ కండ్ల ముందే అభివృద్ధి కనిపిస్తుండటంతో బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాల నుంచి అభ్యర్థులను ప్రకటించకపోవడం ఒకవంతైతే... ఇప్పటివరకు ప్రకటించిన అభ్యర్థులు కూడా క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని మొదలు పెట్టకపోవడం మరో విశేషం. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్ఎస్ ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నారు. కలిసి వచ్చే ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువాలు కప్పుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతూ ప్రతిపక్ష పార్టీలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. వాడలు, బస్తీలు, కాలనీలను చుట్టేసి అన్ని వర్గాల మద్దతును కూడగడుతూ ప్రత్యర్థులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు. దాదాపు రెండు నెలల గులాబీ శ్రేణుల ప్రచార శైలితో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



కార్ఖానా వద్దగల బస్తీల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత

# అమ్ముడుపోయిన వారిని తరిమికొట్టాలి

ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్, అక్టోబర్ 25 : ప్యాకేజీలకు అమ్ముడుపోయిన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డిలను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొర్రెములలో ఉన్న సీబీజీ కన్వెన్షన్‌లో మండల బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ టికెట్‌తో ఎమ్మెల్యేగా గెలిచిన సుధీర్‌రెడ్డి అభివృద్ధిని విస్మరించి, స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడంతోనే పార్టీ నాకు టికెట్ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

- బీఆర్ఎస్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను గడగగడపకు తీసుకెళ్లాలని మంత్రి మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్, తూంకుంట మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం శామీర్‌పేట మండలంలోని ఆలియాబాద్‌లో, ఘట్‌కేసర్ మండల నాయకుల సమావేశం చౌదరిగూడలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ ఎన్నికల ప్రచారం బూత్ స్థాయిల్లో జరగాలన్నారు. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.
- పీర్జాదిగూడ మేడిపల్లి ఎస్వీఎం గ్రాండ్‌లో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆశీర్వాద సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్పొరేషన్ పరిధిలోని సుమారు వెయ్యిమంది సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డితో పాటు మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ హాజరయ్యారు. బీఆర్ఎస్ సర్కారు పదేండ్ల పాలనలో అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పించిందని ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు.

## ముత్యాలమ్మ గుడిలో ప్రమాణానికి సిద్ధమా..

- డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలను ఖండిస్తున్నాం : కార్పొరేటర్లు
- ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని ఎమ్మెల్యే మైనంపల్లికి సవాల్

మల్కాజిగిరి, అక్టోబర్ 25 : కార్పొరేటర్లు డబ్బులు తీసుకున్నారని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేస్తున్న ఆరోపణలను కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, సునీతారాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి ఖండించారు. బుధవారం అల్వాల్ డివిజన్ కార్యాయంలో కార్పొరేటర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌తోనే ప్రజలు తమను గెలిపించారని, పార్టీలోనే ఉంటామన్నారు. తమపై ఎమ్మెల్యే మైనంపల్లి డబ్బులు తీసుకున్నారంటూ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని.. దమ్ముంటే నిరూపించాలన్నారు.ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని, అల్వాల్ ముత్యాలమ్మ దేవాలయంలో తడిబట్టలతో ప్రమాణానికి మేం సిద్ధం.. మరి మీరు సిద్ధమా? అని సవాల్ విసిరారు. ప్రభుత్వ నిధులతో మల్కాజిగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి ఉండగానే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పుడున్న ఎమ్మెల్యే సొంత డబ్బులతో అభివృద్ధి చేయలేదన్నారు. మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా తన ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ పార్టీ టికెట్ కేటాయిస్తే...అయితే తన కుమారుడికి టికెట్ ఇవ్వలేదని పార్టీ అగ్రనేతలపై చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. బెదిరింపులకు భయపడేది లేదన్నారు. విలేకరుల సమావేశంలో చింతల శ్రీనివాస్ రెడ్డి, అనిల్‌కిశోర్, రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కరంచంద్, పరమేశ్, పుదారి రాజేశ్‌కన్న, చంద్రశేఖర్, ప్రేమ్, మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థిని ఖరారు చేయని ప్రతిపక్షాలు

- బేజారవుతున్న క్యాడర్
- బలమైన నాయకత్వం ఉన్న బీఆర్ఎస్ వైపు ఆయా పార్టీల నేతల చూపు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్, బీజేపీలు తర్జన భర్జన పడుతున్నాయి. దీంతో ఆ పార్టీల క్యాడర్ బీఆర్ఎస్‌లోకి వస్తున్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డాం ఎమ్మెల్యే అభ్యర్థినంటూ నియోజకవర్గంలో తిరిగిన వాళ్లు చాలా మంది ఉన్నారు, అలాంటిది వారి వారి నాయకులకు టిక్కెట్టు రాదనే తేలిపోతుండటంతో ఒక్కొక్కరుగా కారెక్కుతున్నారు. ఎల్బీనగర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేశారు.ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి గతంలో ఏ పార్టీ హయాంలోనూ జరుగలేదు, దీంతో స్థానిక ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అయిన ప్రస్తుత ఎమ్మెల్యేకు ఎక్కడకు వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారు. ఇది ఇప్పుడు ప్రతి పక్ష పార్టీల నాయకుల్లో ఆందోళన కల్గిస్తుండటంతో... ఎవరిని పార్టీ అభ్యర్థిగా ఖరారు చేయాలనే ఇంకా చర్చలు జరుపుతున్నారు. ఇదే ఆ పార్టీ క్యాడర్‌ను నిరుత్సాహానికి గురిచేస్తున్నది. తమ నాయకుడు పేరు వస్తుందని ఆలోచనలో ఉన్న సమయంలో ప్యారాచూట్ నాయకుల పేర్లు వినిపించడం, అంతలోనే మరో నాయకుడి పేరు తెరపైకి రావడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే పార్టీలో కనీసం ఎమ్మెల్యే అభ్యర్థిని కూడా నిర్ణయించలేని పరిస్థితిలో ఉన్న పార్టీలో మనమున్నామా? అని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. బలమైన నాయకత్వం ఉన్నచోటకు వెళ్లడంతోనే గుర్తింపు, అభివృద్ధి, ప్రజలకు సేవ చేసే అవకాశాలుంటాయనే భావనలో ఆయా పార్టీల క్యాడర్ మాట్లాడుకుంటూ బీఆర్ఎస్ పార్టీలోకి చేరేందుకు సిద్ధమవుతున్నారు.




అశోక్‌నగర్ ఎన్టీఆర్ స్టేడియంలో సిద్ధమవుతున్న బీఆర్ఎస్ ప్రచార రథం